సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం । 24 । మార్చి । 2025



హామీలు అమలు చేయాలి
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. - 8లో



చిక్కితే తుక్కే!
వివిధ కేసుల్లో పోలీసులు సీజ్ చేసిన 500కు పైగా వాహనాలు భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో తుప్పు పట్టిపోతున్నాయి. - 9లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-33 (సోమవారం సా॥)
సహర్ 4-54 (మంగళవారం ఉ॥)

న్యూస్‌రీల్

26న యాదగిరిగుట్ట ఆలయ హుండీ లెక్కింపు

యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను ఈ నెల 26న లెక్కించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ భాస్కర్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటలకు కొండ క్రింద ఉన్న సత్యనారాయణస్వామి వ్రత మండపంలో హుండీ ఆదాయాన్ని లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

భువనగిరి : తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఆదివారం భువనగిరిలోని స్వర్ణగిరి క్షేత్రం ఆవరణలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. సమాఖ్య శాశ్వత చైర్మన్‌గా వెన్నెంపల్లి జగన్మోహన్ శర్మ, అధ్యక్షుడిగా మోత్కూరి రామేశ్వర్‌రావు శర్మ, ప్రధాన కార్యదర్శిగా వైద్య ప్రభాకర్ శర్మ, కోశాధికారిగా సముద్రాల విజయ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. ఎన్నికల అధికారి దేశపతి శర్మ వ్యవహరించారు. కార్యక్రమంలో భాస్కర్‌మూర్తి, శ్రీనివాస్, రఘునందన్, నాగరాజు, కృష్ణమూర్తి, వెంకటరమణ పాల్గొన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు మేల్కొలుపులో భాగంగా స్వయంభూవులకు సుప్రభాత సేవ చేపట్టారు. ఆ తర్వాత స్వామి, అమ్మవార్లకు ఆరాధన, నిజాభిషేకం, అర్చన సేవలు గావించారు. ఇక ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, అష్టోత్తరం, ప్రాకార మండపాల్లో శ్రీ సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, వేద ఆశీర్వచనం, తదితర కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.రాత్రి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

సాహిత్యం.. సమాజ వికాసానికి దోహదం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భారత జాతీయ సాహిత్య పరిషత్ కన్వీనర్ కసిరెడ్డి వెంకట్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : సాహిత్యం సమాజ వికాసానికి దోహదపడుతుందని భారత జాతీయ సాహిత్య పరిషత్ కన్వీనర్ కసిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. భూదాన్‌పోచంపల్లి మండలం గౌస్‌కొండకు చెందిన కవి, ఉపాధ్యాయుడు డాక్టర్ పొందాల మహేశ్వర్ రచించిన తెలుగు భాష యశోభూషణం, శ్రీ మహేశ్వరీ పద్మ కావ్యం పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి పెసరు లింగారెడ్డి, భువనగిరి ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తూర్పు మల్లారెడ్డి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, తెలంగాణ జానపదం, కళల అధ్యక్షుడు బండిరాజుల శంకర్, విశ్రాంత అధ్యాపకులు రావిరాల స్వామి, మాజీ సర్పంచ్ పక్కీరు లావణ్యదేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాంపల్లి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.25 వేల కోట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న జయరాములు

మోత్కూరు : చేతి వృత్తిదారుల సంక్షేమానికి రూ.25 వేల కోట్లు కేటాయించాలని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ యాదాద్రి భువనగిరి జిల్లా కన్వీనర్ బొలగాని జయరాములు డిమాండ్ చేశారు. ఆదివారం మోత్కూరులో జరిగిన తెలంగాణ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్‌లో చేతివృత్తుల సంక్షేమానికి నామమాత్రపు నిధులు కేటాయించడం తగదన్నారు. ఈ సమావేశంలో గుండు వెంకటనర్సు, మద్దెపురం రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బతుకులతో బెట్టింగ్!

ఐపీఎల్ వేళ పందేల జోరు.. ఆకర్షితులవుతున్న యువత

- సులభంగా డబ్బు సంపాదించవచ్చన్న అత్యాశతో అప్పులు తెచ్చి ఆన్‌లైన్‌లో బెట్టింగ్
- నష్టపోవడంతో అవమాన భారం భరించలేక ఆత్మహత్యలు
- అప్పులు తీర్చలేక వీధిన పడుతున్న కుటుంబాలు
- ఐపీఎల్ మ్యాచ్‌లు ప్రారంభం.. రంగంలోకి బెట్టింగ్ రాయుళ్లు
- పిల్లలను గమనిస్తుండాలని తల్లిదండ్రులకు సూచిస్తున్న పోలీసు శాఖ



చౌటుప్పల్ మండలానికి చెందిన ఓ యువకుడు బీటెక్ చదివాడు. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూనే రియల్ ఎస్టేట్ బిజినెస్ చేశాడు. వ్యాపారం కలిసి రావడంతో పెద్ద ఎత్తున డబ్బు సంపాదించాడు. ఈ క్రమంలో ఫ్రెండ్స్ ద్వారా ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌ల గురించి తెలుసుకున్నాడు. మొదట్లో బాగానే డబ్బులు వచ్చేవి. ఆ తరువాత అత్యాశకు పోయి నష్టపోయాడు. పోయిన డబ్బును రాబట్టుకునేందుకు స్నేహితులు, బంధువుల వద్ద రూ.3 కోట్ల వరకు అప్పులు చేసి బెట్టింగ్ పెట్టాడు. అయినా కలిసిరాలేదు. అప్పులు ఇచ్చినవారి నుంచి ఒత్తిడి పెరగడంతో చివరికి తల్లిదండ్రులకు విషయం తెలిసింది. చేసేదేమి లేక ఏడు ఎకరాల భూమి అమ్మి అప్పులు తీర్చారు. ఇది ఒక్కరి సమస్య కాదు.. ఎంతోమంది బాధితులు ఉన్నారు.

సాక్షి, యాదాద్రి : సులభంగా డబ్బు సంపాదించవచ్చన్న ఆశతో చాలా మంది బెట్టింగ్ యాప్‌లకు ఆకర్షితులవుతున్నారు. కాలేజీ యువత, నిరుద్యోగులతో పాటు చదువుకుని ఉద్యోగాలు రాక ఇంట్లో ఉంటున్న మహిళలు సైతం ఆన్‌లైన్ గేమ్స్, ఈ బెట్టింగ్‌లకు బానిసలు అవుతున్నారు. చేతిలో ఫోన్ ఉంటే చాలు.. ఎక్కడి నుంచైనా బెట్టింగ్ నడపవచ్చు. ఈ వ్యవహారంలో డబ్బులు సంపాదించేది కేవలం ఒకరిద్దరు మాత్రమే కాగా ఎంతోమంది నష్టపోయి ఆర్థికంగా చితికిపోతున్నారు. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన ఆన్‌లైన్ బెట్టింగ్ పల్లెలకు సైతం విస్తరించడం ఆందోళన కలిగిస్తోంది.

ఐపీఎల్ వేళ జాగ్రత్త :
ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మొదలుకావడంతో బెట్టింగ్ రాయుళ్లు సిద్ధమవుతున్నారు. క్రికెట్‌కు ఉన్న క్రేజ్‌ను క్యాష్ చేసుకునేందుకు ఆన్‌లైన్ పద్ధతుల్లో బెట్టింగ్‌ను ప్రోత్సహిస్తుంటారు. ఈ బెట్టింగ్ యాప్‌లతో యువతను ఆకర్షిస్తుంటారు. బాల్ టు బాల్, ఓవర్ టు ఓవర్, సిక్స్, ఫోర్, విన్నర్, వికెట్, ప్లేయర్లపై బెట్టింగ్ నిర్వహిస్తారు. ఈ వ్యవహారంలో బెట్టింగ్ రాయుళ్లు ఇతరులకు అర్థంకాని కోడ్ భాషను వాడుతారు. ఎక్కడో ఉండి బుకీలు, ఏజెంట్ల ద్వారా ఈ వ్యవహారాన్ని నడిపిస్తుంటారు. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ ప్రారంభం కావడంతో తమ పిల్లలపై కన్నేసి ఉంచాల్సిన అవసరం తల్లిదండ్రులపై ఉంది.

కొన్ని ఉదాహరణలు

❖ జిల్లాకు చెందిన ఓ యువకుడు ఉద్యోగం కోసం హైదరాబాద్‌లోని కోచింగ్ సెంటర్ లో శిక్షణ పొందుతున్నాడు. ఈ క్రమంలో అతని స్నేహితుడు సదరు యువకుడిని బెట్టింగ్ ఊబిలోకి దింపాడు. నేను గంటలకు రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు సంపాదిస్తున్నాను, నీవు కూడా బెట్టింగ్‌లో డబ్బు పెడితే తక్కువ సమయంలో సులభంగా రూ.లక్షల్లో సంపాదించవచ్చని నమ్మించాడు. ఆ తరువాత స్నేహితులతో కలిసి గోవా వెళ్లాడు. అక్కడ ఈ బెట్టింగ్, క్యాషినో లో డబ్బులు పెట్టాడు. తన దగ్గర ఉన్న రూ.60 లక్షలతోపాటు మరో రూ.20లక్షలు అప్పుచేసి పోగొట్టుకున్నాడు. చివరికి అప్పు తీర్చేమార్గం లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

❖ చౌటుప్పల్ మండలానికి చెందిన ఓ వ్యక్తి లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సెల్‌ఫోన్‌లో సరదాగా మొదలైన రమ్మీ గేమ్ వ్యసనంగా మారింది. పెద్ద ఎత్తున డబ్బులు పెట్టి నష్టపోయాడు. పోయిన డబ్బును రాబట్టుకునేందుకు అప్పుతెచ్చి పెట్టాడు. చివరికి ఆస్తులు అమ్ముకుని అప్పులు తీర్చాడు.

క్రికెట్ బెట్టింగుల జోలికి వెళ్లొద్దు

ఐపీఎల్ సీజన్ ప్రారంభమైనందున యువత బెట్టింగుల జోలికి వెళ్లొద్దని పోలీసు శాఖ సూచిస్తోంది. బెట్టింగులు పెట్టి ఆర్థికంగా నష్టపోవడం ద్వారా వ్యక్తిగతంగా ఇబ్బందులు పడటమే కాకుండా కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తయ్యాయని, విద్యార్థులు సెలవుల దృష్ట్యా ఖాళీగా ఉంటారని వారి కదలికలను తల్లిదండ్రులు గమనిస్తుండాలని పేర్కొన్నారు. సెల్‌ఫోన్లలో ఏం చేస్తున్నారో గమనిస్తుండాలని సూచిస్తున్నారు. అవసరానికి మించి పిల్లలకు డబ్బులు సమకూర్చవద్దని విజ్ఞప్తి చేశారు. పిల్లల ప్రవర్తనలో మార్పులు చోటు చేసుకున్నట్టు అనుమానం వస్తే వెంటనే కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచిస్తున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌ల దృష్ట్యా పోలీసు శాఖ కూడా నిఘా పెట్టిందని, ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని ఆ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

● కొమ్మకొమ్మకో కొంగ



చౌటుప్పల్ పట్టణంలోని నాగులకుంటలో చెట్లపై వాలిన కొంగలు కనువిందు చేస్తున్నాయి. ప్రతి రోజూ సాయంత్రం పెద్ద సంఖ్యలో ఇక్కడికి చేరుకుని చెట్లపై వాలుతుంటాయి. వీటిని దూరం నుంచి చూస్తే చెట్టుకు పూసిన పువ్వులను తలపిస్తున్నాయి. అంతేకాదు.. నీటిలో పడిన కొంగల ప్రతిబింబాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. - చౌటుప్పల్

వైద్యశిబిరాలతో ప్రజలకు మేలు

● ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి





మాట్లాడుతున్న ఎంపీ చామల, మందులను పరిశీలిస్తున్న కలెక్టర్

బొమ్మలరామారం : గ్రామీణ పేదలు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బొమ్మలరామారం మండలం యావపూర్‌లో ఆదివారం వైద్యారోగ్యశాఖ, హైదరాబాద్‌కు చెందిన మెడికవర్ ఆస్పత్రి సంయుక్తంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని కలెక్టర్ హనుమంతరావుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాల ప్రజలకు కార్పొరేట్ వైద్యసేవలు అందించేందుకు కలెక్టర్ హనుమంతరావు చొరవచూపడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలన్న సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. అనంతరం ఎంపీ, కలెక్టర్ వైద్యశిబిరంలో కలియదిరిగి ప్రజలకు అందజేస్తున్న వైద్య సేవలను, మందులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ శిల్పిని, విద్యుత్ శాఖ ఎస్ఈ సుధీర్‌కుమార్, డీఈఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ రాజాత్రివిక్రమ్, ఏఈ సాదు సాయిదీప్, వైద్యాధికారులు సుమలత, శ్రీ హర్ష, రుచిర, సీహెచ్ఓ మురళీధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్, బొమ్మలరామారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లేష్, నాయకులు జంగారెడ్డి, ఆగంరెడ్డి, ఎనగండ్ల సుధాకర్, జితేందర్‌రెడ్డి, శ్రావణ్ ప్రసాద్‌రెడ్డి, బాసారం బాబు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న గంగిడి మనోహర్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి విమర్శించారు. చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామంలో ఆదివారం నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. అందులో బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం తప్ప.. మరే పథకం కూడా పూర్తిస్థాయిలో అమలుకాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ఈ నెల 25 నుంచి మండలంలోని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఒకే దేశం.. ఒకే ఎన్నిక ద్వారా ప్రజాధనం వృథాకాకుండా ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షం,జిల్లా ఉపాధ్యక్షుడు రమణగోని శంకర్, మండల అధ్యక్షులు కై రంకొండ ఆశోక్, మున్సిపాలిటీ అధ్యక్షురాలు కడారి కల్పన, నాయకులు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, ఉడుగు యాదయ్య, కట్ట కృష్ణ, పాలకూర్ల జంగయ్య, కంది లక్ష్మారెడ్డి, చినుకని మల్లేష్, ముత్యాల భూపాల్‌రెడ్డి, శాఖ చంద్రశేఖర్‌రెడ్డి, కాయితి రమేష్, బాతరాజు సత్యం ,దిండు భాస్కర్, పబ్బు వంశీ పాల్గొన్నారు.

క్షయ.. అవగాహనతోనే అంతం

- జిల్లాలో తగ్గుముఖం పట్టని కేసులు
- 1,310 మంది బాధితులు
- ఉచిత చికిత్స, మందుల పంపిణీ
- ప్రతి నెలా వెయ్యి రూపాయలు జమ
- నేడు ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం



భువనగిరి : క్షయ వ్యాధి నివారణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నా కేసులు తగ్గుముఖం పట్టడం లేదు. ప్రజల్లో అవగాహన లోపం వల్లే వ్యాధి నియంత్రణలోకి రావడం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం జిల్లాలో 1,310 మంది క్షయ రోగులు ఉన్నారు. అవగాహనతోనే క్షయ (టీబీ, మైక్రోబ్యాక్టీరియం ట్యూబర్‌కులోసిస్) వ్యాధిని నివారించవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు. సోమవారం క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా కథనం.

ఏటా 17వేల నుంచి 19 వేల మందికి పరీక్షలు
క్షయ వ్యాధి నివారణకు సంబంధిత అధికారులు ఏటా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం 17వేల నుంచి 19వేల మందికి పరీక్షలు నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తిస్తున్నారు. ఈ ఏడాది కూడా సుమారు 19వేల మందికి పరీక్షలు చేయగా.. ఇందులో 450 మంది క్షయ బారిన పడినట్లు గుర్తించారు. వీరితో పాటు గతంలో గుర్తించిన 860 మంది ఉన్నారు. వీరికి ఉచిత చికిత్సతో పాటు మందులు అందజేస్తున్నారు. అంతేకాకుండా బాధితుల ఖాతాల్లో ప్రతి నెలా రూ.1000 జమచేస్తున్నారు.

క్షయరహిత గ్రామాలుగా ప్రతిపాదనలు
జిల్లాలో 17 మండలాల పరిధిలో 421 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో ఐదు గ్రామాలను క్షయ రహిత(టీబీ ముక్త్ పంచాయతీ)గా గుర్తించి అవార్డులకోసం ప్రతిపాదనలు పంపారు. వీటిలో బొల్లేపల్లి పీహెచ్‌సీ పరిధిలో సూరేపల్లి, బీబీనగర్ పీహెచ్‌సీ పరిధిలో మహదేవ్‌పూర్, మోటకొండూరు పీహెచ్‌సీ పరిధిలో మాటూరు, వలిగొండ పీహెచ్‌సీ పరిధిలో లింగరాజ్‌పల్లి, సంస్థాన్‌నారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మల్కచెరువుతండా ఉన్నాయి.

నేడు అవగాహన ర్యాలీ
క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భువనగిరిలో సోమవారం ఉదయం 10 గంటలకు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి నుంచి జగదేవ్‌పూర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహిస్తారు. అనంతరం ఏర్పాటు చేసే కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతరావు పాల్గొని మాట్లాడనున్నారు. క్షయ వ్యాధి నివారణకు కృషి చేసిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానం చేయనున్నారు.

వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు

అలసట రావడం, తలనొప్పి, బరువు తగ్గడం, జ్వరం, రాత్రి పూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు క్షయ వ్యాధిగ్రస్తులో కనిపిస్తాయి. వ్యాధివ్యాప్తి చెకుండా చేతులను తరచూ శుభ్రంగా కడగాలి. దగ్గినప్పుడు మోచేయి లేదా రుమాలును నోటికి అడ్డంగా పెట్టాలి. వ్యాధి ఉన్న వ్యక్తులకు దూరంగా ఉండాలి. వైద్యులు సూచించిన మందులనే వాడాలి.

బాధితులకు ప్రత్యేక చికిత్స

జిల్లాలో క్షయ వ్యాధి సోకిన వారికి ఆరు నెలల నుంచి ఉచితంగా చికిత్సతో పాటు మందులు అందజేస్తున్నాం. క్షయ వ్యాధి నివారణ కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. త్వరలో పెద్దలకు కూడా బీసీజీ టీకాలు వేస్తాం. బీసీజీ టీకాలు వేయడానికి 2లక్షల మందిని గుర్తించాం.

– డాక్టర్ మనోహర్, డీఎంహెచ్ఓ

సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తాం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, మందుల సామేల్ తదితరులు

- ప్రజా పాలనతో విప్లవాత్మక మార్పులు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- జాన్‌పహాడ్ దర్గా పరిధిలో మంత్రి కోమటిరెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి అభివృద్ధి పనులపై సమీక్ష



పూలచాదర్ తీసుకెళ్తున్న మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

హుజూర్‌నగర్, పాలకవీడు: ఉమ్మడి జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను అనుకున్న సమయానికి పూర్తిచేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా వద్ద నిర్వహించిన కందూరు కార్యక్రమానికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులు హాజరయ్యారు. అనంతరం స్థానిక డక్కన్ సిమెంట్ పరిశ్రమ అతిథి గృహంలో రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి వెంకట్‌రెడ్డితో కలిసి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్ఎల్‌బీసీ, డిండి, నెల్లికల్లు, నాగార్జునసాగర్ ఎడుమ కాల్వ, ఏఎంఆర్‌కు మరమ్మతులు చేయిస్తామని అన్నారు. గంధమల్ల ప్రాజెక్టుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని, త్వరలో దాని పనులు ప్రారంభిస్తామని చెప్పారు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలోని ప్రజాపాలనతో విప్లవా త్మక మార్పులు తీసుకొస్తున్నామని మంత్రి చెప్పారు.

రోడ్ల అభివృద్ధిలో నంబర్‌వన్‌గా ఉంచుతాం : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్ల అభివృద్ధిలో ఉమ్మడి జిల్లాను రాష్ట్రంలో నంబర్ వన్‌గా ఉంచుతామని అన్నారు. రూ.వెయ్యి కోట్లతో రైల్వే బ్రిడ్జిలు, రూ.140 కోట్లతో దామరచర్ల వద్ద బ్రిడ్జి నిర్మించేందుకు కేంద్ర మంత్రి అనుమతి ఇచ్చారని కోమటిరెడ్డి తెలిపారు. బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టుకు రూ.200 కోట్లు కూడా ఇవ్వకుండా గత ప్రభుత్వం పదేళ్లు పెండింగ్‌లో ఉంచిందని, మేము అధికారంలోకి రాగానే పూర్తిచేసి సీఎం చేతుల మీదుగా ప్రారంభించామన్నారు. దేవాదుల ద్వారా సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలకు సాగునీరు అందిస్తామన్నారు. దక్షిణ తెలంగాణలో 36 అసెంబ్లీ సీట్లకు కాంగ్రెస్ 32 గెలిచిందని..ప్రజలు మావైపు ఉన్నారనేందుకు ఇది నిదర్శనమన్నారు. ఇవన్నీ తెలియకుండా బీఆర్ఎస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. పదేళ్లు అధికారం ఇస్తే ఏమీ చేయని వారు పన్నెండు నెలలకే కొంపలు మునిగినట్లు మామీద పడుతున్నారని ఎద్దేవా చేశారు. రెండేళ్లలో అన్ని రోడ్లు బీటీగా మారుస్తామని, ఏప్రిల్ రెండవ వారంలో టెండర్లు పిలువనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వివరించారు. జాతీయ రహదారులను సైతం విస్తరించేలా కృషి చేస్తున్నామన్నారు. తొలుత హెలిపాడ్ వద్ద మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలకు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. సమావేశంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యేలు పద్మావతిరెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, మందుల సామేలు, వేముల వీరేశం, బాలు నాయక్, బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పాడి అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, సీపీఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, భూక్యాగోపాల్, మాళోతు మోతీలాల్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభా ఏర్పాట్లు పక్కాగా ఉండాలి



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి ఉత్తమ్

ఉగాది పర్వదినాన సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా హుజూర్‌నగర్‌లో రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ పథకం ప్రారంభం సందర్భంగా నిర్వహించే సభా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఫణిగిరి గుట్టకు వెళ్లే రోడ్డులో సీఎం సభా ప్రాంగణ ఏర్పాటుకు మంత్రి జిల్లా అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మంత్రి క్యాంప్ కార్యాలయంలో సీఎం సభ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సభకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీకి ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ నర్సింహ, అదనపు కలెక్టర్ రాంబాబు, ఇరిగేషన్ సీఈ రమేష్‌బాబు, ఆర్‌టీసీ ఆర్ఎం జానిరెడ్డి, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ చరమందరాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, నాయకులు యరగాని నాగన్న, సీహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, తన్నీరు మల్లికార్జున్, కోతి సంపత్‌రెడ్డి, శివరాంయాదవ్, ఆదెర్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పిడుగుపాటుతో రెండు ఆవులు మృతి



మృతిచెందిన ఆవుల వద్ద బాధిత రైతు

దేవరకొండ: పిడుగు పడి రెండు ఆవులు మృతి చెందాయి. దేవరకొండ మండలం కాసారం గ్రామానికి చెందిన రైతు అబ్బనోని నాగయ్య తనకున్న రెండు పాడి ఆవులను శనివారం రాత్రి తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు కట్టేసి ఉంచాడు. రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో పిడుగు పడి రెండు ఆవులు మృతిచెందాయి. ఆవుల విలువ రూ.1.20లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

నకిలీ కరెన్సీ నోట్ల చలామణి



నకిలీ రూ.100 నోటు

నడిగూడెం: నడిగూడెం మండల కేంద్రంలో నకిలీ రూ.100 నోట్లు చలామణి అవుతున్నాయని చిరు వ్యాపారులు ఆరోపిస్తున్నారు. సాధారణంగా రిజర్వ్ బ్యాంక్ జారీ చేసిన కరెన్సీ నోట్లు నీటితో తడిస్తే మరకలు పడవని, కానీ తమ వద్దకు వచ్చిన కొన్ని రూ.100 నోట్లపై నీటితో తడిస్తే ఏర్పడిన మరకలు ఉన్నట్లు చిరు వ్యాపారులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నకిలీ నోట్లు చలామణి కాకుండా చూడాలంటున్నారు.

చెరువులో మునిగి యువకుడి మృతి

తిరుమలగిరి: చెరువులో మునిగి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధి అనంతారంలో ఆదివారం సాయంత్రం జరిగింది. అనంతారం గ్రామానికి చెందిన శీల శ్రీకాంత్(28) గేదెలను మేపడానికి గ్రామ పరిధిలోని పెద్ద చెరువు దగ్గరకి వెళ్లాడు. గేదెలు చెరువులోకి వెళ్లడంతో వాటిని బయట తోలుకురావడానికి చెరువులోకి వెళ్లి ఈత రాక పోవడంతో నీట మునిగి మృతిచెందాడు. మృతుడికి ఆరు నెలల క్రితమే వివాహం జరిగింది.

వైజాగ్ కాలనీలో ఈతకు వెళ్లి..

చందంపేట: నేరేడుగొమ్ము మండలం కాచరాజుపల్లి సమీపంలోని పుష్కర ఘాటు వద్ద నీట మునిగి హైదరాబాద్లోని బోడుప్పల్కు చెందిన శ్రీరామోజు ఉదయ్‌కిరణ్(22) మృతిచెందాడు. శనివారం నలుగురు స్నేహితులతో కలిసి వైజాగ్ కాలనీకి వచ్చిన ఉదయ్‌కిరణ్ ఆదివారం ఉదయం కాచరాజుపల్లి పుష్కర ఘాటు వద్ద ఈతకు వెళ్లి నీటిలో మునిగి మృతిచెందాడు. మృతుడి తండ్రి రాజేష్ కన్నా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నేరేడుగొమ్ము ఎస్ఐ సతీష్ తెలిపారు.

రైతులను ఢీకొట్టిన లారీ

- ఒకరికి తీవ్ర గాయాలు

మిర్యాలగూడ అర్బన్: ధాన్యం అమ్మకానికి వచ్చిన రైతులు రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టింది. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణలో ఆర్టీఓ కార్యాలయం సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు.. దామరచర్ల మండలం కేశవాపురం గ్రామానికి చెందిన రైతులు జానకిరాములు, బచ్చు శ్రీను ట్రాక్టర్లో ధాన్యం లోడుతో మిర్యాలగూడ పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయం సమీపంలో గల రైస్ మిల్లు వద్ద నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై నిలిపారు. హోటల్లో భోజనం చేసిన అనంతరం రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన లారీ వారిద్దరిని ఢీకొట్టింది. జానకిరాములుకు తీవ్ర గాయాలు కాగా, బచ్చు శ్రీనుకు స్వల్ప గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో వారిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. జానకిరాములు పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మిర్యాలగూడ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫాంపాండ్‌లో మునిగి ఇద్దరు యువకులు మృతి

- ప్రాణాలతో బయటపడిన మరో యువకుడు
- చిట్యాల మండలం ఏపూరు గ్రామ పరిధిలోని డీఈసీ పరిశ్రమలో ఘటన



రాఘవేంద్ర, నవీన్‌కుమార్ (ఫైల్)



ప్రాణాలతో బయటపడిన తరుణ్

చిట్యాల: ఫాంపాండ్‌లో మునిగి ఇద్దరు యువకులు మృతిచెందారు. ఈ ఘటన చిట్యాల మండలం ఏపూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివారం జరిగింది. చిట్యాల ఎస్ఐ ఎన్. ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మేస్త్రీ పనిచేసే నలపరాజు రాములు కుమారుడు నవీన్‌కుమార్(23), రసూల్‌పూర్ గ్రామానికి చెందిన హోంగార్డు చింతపల్లి లింగరాజు కుమారుడు రాఘవేంద్ర(20), నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లి గ్రామానికి చెందిన కడెం తరుణ్ స్నేహితులు. వీరు ముగ్గురు నల్లగొండలోని మార్కోని ఐటీఐ కాలేజీలో చదువుకున్నారు. ఐటీఐ పూర్తయిన తర్వాత ఏడాది క్రితం వీరు ముగ్గురు కలిసి చిట్యాల మండలం ఏపూరు గ్రామ పంచాయతీ పరిధిలోని డీఈసీ పరిశ్రమలో ఎలక్ట్రికల్ విభాగంలో అప్రెంటిస్‌గా చేరారు. అప్రెంటిస్ పూర్తిచేసి అదే పరిశ్రమలోని ఎలక్ట్రికల్ ప్యానెల్ మోడ్ మ్యానుఫ్యాక్చరింగ్ విభాగంలో ఉద్యోగాలు చేస్తున్నారు. శనివారం రాత్రి వరకు పరిశ్రమలో విధులు నిర్వహించిన వీరు రాత్రి పరిశ్రమలో ఉండి పోయారు.

ఫాంపాండ్‌లోకి దిగి..

సెలవు రోజు కావడంతో ఆదివారం కూడా పరిశ్రమలోనే ఉన్న నవీన్‌కుమార్, రాఘవేంద్ర, తరుణ్ మధ్యాహ్నం 12గంటల సమయంలో పరిశ్రమ ఆవరణలోని ఓ చివరలో నిర్వహిస్తున్న గోశాల సమీపంలో నీటి అవసరాల కోసం తీసిన ఫాంపాండ్ వద్దకు చేరుకున్నారు. మొదట నవీన్‌కుమార్ ఫాంపాండ్‌లోకి ఒకస్కారిగా దూకాడు. వెంటనే ఈత రాకపోయినప్పటికీ రాఘవేంద్ర ఫాంపాండ్‌లోకి దూకి నవీన్‌కుమార్‌ను పట్టుకున్నాడు. ఇద్దరు నీటిలో మునిగిపోతుండటంతో ఒడ్డున ఉన్న తరుణ్ తన షర్ట్‌తో వారిద్దరిని బయటికి లాగే ప్రయత్నం చేయగా.. ఇతడు కూడా ఫాంపాండ్‌లోకి జారి పడిపోయాడు. తరుణ్ తేరుకుని ఫాంపాండ్ చివరలో దొరికిన ప్లాస్టిక్ పట్టా అంచును పట్టుకుని బయటికి వచ్చి.. కొద్ది దూరంలో ఉన్న ఇతర కార్మికులకు విషయం తెలియజేశాడు. వారు వచ్చి నీటిలో మునిగిపోతున్న నవీన్‌కుమార్, రాఘవేంద్రను బయటికి తీయగా.. అప్పటికే వారిద్దరు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుల కుటుంబాలకు డీఈసీ పరిశ్రమ యజమాన్యం తగిన పరిహారం అందించి ఆదుకోవాలని బంధువులు కోరుతున్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



పాదయాత్ర ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

రామన్నపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఆదివారం రామన్నపేట మండలం కొమ్మాయిగూడెం గ్రామంలో సీపీఎం మండలశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాచైతన్య పాదయాత్ర ప్రారంభ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా కేంద్ర ప్రభుత్వం యేటా రెండు కోట్ల ఉద్యోగాలు, రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా ఎన్నికల వాగ్దానాలను ఎలా అమలు చేస్తాయాని ప్రశ్నించారు. డ్రైపోర్ట్ పేరుతో రైతులను మభ్యపెట్టి కొనుగోలు చేసిన భూముల్లో కాలుష్యకారక పరిశ్రమలు ఏర్పాటు చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. డీలిమిటేషన్‌లో భాగంగా రామన్నపేట అసెంబ్లీ నియోజకవర్గంను పునరుద్ధరించాలని, రామన్నపేట ఆస్పత్రి స్థాయిని వంద పడకలకు పెంచాలని, ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాలువలను పూర్తిచేసి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఇరవై ఏళ్లుగా కాలువల పనులు కాంట్రాక్టర్లకు వరప్రదాయినిగా మారాయని ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించే వరకు పార్టీ పోరాడుతుందని తెలిపారు. పాదయాత్రకు పార్టీలకతీతంగా సంఘీభావం తెలపాలని కోరారు. పాదయాత్రలో భాగంగా సీపీఎం నాయకులు ప్రతిపాదిత అంబుజా సిమెంట్ పరిశ్రమ గేటు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో ఎండిన వరి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, జెల్లెల పెంటయ్య, బూర్గు కృష్ణారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, పాదయాత్ర బృందం సభ్యులు బొడ్డుపల్లి వెంకటేశం, బోయిని ఆనంద్, కందుల హన్మంత్, గన్నెబోయిన విజయభాస్కర్, వేముల సైదులు, గొరిగె సోములు, బొడిగె రజిత, మేడి గణేష్, కొమ్ము అంజమ్మ, శానగొండ రాము తదితరులు పాల్గొన్నారు.



జనంపల్లిలో ఎండిన వరి పొలంను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తోంది

- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడ: ముస్లిం, మైనార్టీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతర కృషిచేస్తోందని రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి కోదాడకు చెందిన రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ ఎండీ జబ్బార్ నివాసంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో మంత్రి పాల్గొని మాట్లాడారు. రెండు దశాబ్దాలుగా కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాలకు చెందిన మైనార్టీల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నట్లు తెలిపారు. కోదాడలో ఈద్గా అభివృద్ధికి నిధులు మంజూరు చేయంచానని పేర్కొన్నారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లింలకు స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బషీర్, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ఏర్నేని బాబు, పారా సీతయ్య, అల్తాఫ్ హుస్సేన్, మునావర్, కందుల కోటేశ్వరరావు, బాగ్దాద్, బాజాన్, కేఎల్ఎన్. ప్రసాద్, ఈదుల కృష్ణయ్య, రామినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లీలావతికి స్త్రీశక్తి జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న లీలావతి

హుజూర్‌నగర్‌రూరల్: హుజూర్‌నగర్ మండలం గోపాలపురం గ్రామానికి చెందిన విన్నపం ఒక పోరాటం స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు చీకూరి లీలావతికి స్త్రీశక్తి జాతీయ పురస్కారం లభించింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా లీలావతి చేసిన పలు సేవా కార్యక్రమాలను గుర్తించి ఆమెకు స్త్రీశక్తి జాతీయ పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ మీనగ గోపిబోయ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసింది

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



పొన్నాల సంజీవరెడ్డి విగ్రహావిష్కరణలో పాల్గొన్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

అత్మకూర్(ఎస్): కాంగ్రెస్ ప్రభుత్వం చేయని రుణమాఫీ చేసినట్లుగా గొప్పలు చెప్పుకుంటూ రైతులను మోసం చేసిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని పాత సూర్యాపేటలో మాజీ సర్పంచ్ పొన్నాల సంజీవరెడ్డి విగ్రహాన్ని ఆయనఆవిష్కరించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి అబద్ధాలు చెబుతుందని విమర్శించారు. అమలుకు సాధ్యంకాని హామీలు ఇచ్చి చేతులెత్తేసిన కాంగ్రెస్ పార్టీ రైతు సమస్యలపై ప్రశ్నిస్తుంటే అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం దుర్మార్గమన్నారు. బ్యాంకులు చెప్పిన దానికి, కేబినెట్, బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో చెప్పేసరికి 30 శాతం రుణమాఫీ కూడా కాలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా ఎత్తేస్తున్నారని, మంత్రులు సంక్షేమం మరిచి జేబులు నింపుకుంటున్నారని, అసమర్థ ప్రభుత్వాన్ని ఎలా భరించాలని ప్రజలు ఆవేదన పడుతున్నారని అన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ విషయంలో కుట్రలు చేస్తోందని, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అర్థం లేకుండా మాట్లాడుతున్నారని, డీలిమిటేషన్ విషయంలో బీజేపీ కుట్రలను ఎట్టి పరిస్థితుల్లో సాగనీయమని, తెలంగాణ హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తూడి నరసింహారావు, నాయకులు గోపగాని వెంకటనారాయణగౌడ్, నిమ్మల శ్రీనివాస్, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, ముద్దం కృష్ణారెడ్డి, బత్తుల ప్రసాద్, పన్నాల అలివేల, కసగాని బ్రహ్మం, జీడి భిక్షం, ముద్దం మధుసూదన్‌రెడ్డి, గోపగాని మల్లయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా అశ్వవాహన సేవ



పూజల్లో పాల్గొన్న చినజీయర్ స్వామి, మైహోం గ్రూప్ చైర్మన్ జూపల్లి రామేశ్వరరావు

మేళ్లచెరువు: మేళ్లచెరువు మండల కేంద్రం పరిధిలోని మైహోం సిమెంట్ పరిశ్రమలో గల శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి 27వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఐదో రోజు తిరువీధి ఉత్సవం, అశ్వవాహన సేవ, దోపోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి, మైహోం గ్రూప్ చైర్మన్ జూపల్లి రామేశ్వరరావు, శ్రీకుమారి దంపతులు, మునగాల రామ్మోహన్‌రావు, అరుణ దంపతులు, యూనిట్ హెడ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏలు ప్రకటించాలి



మాట్లాడుతున్న అలుగుబెల్లి నర్సిరెడ్డి

సూర్యాపేటటౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ ప్రభుత్వాన్ని చేశారు. టీఎస్ యూటీఎఫ్ సూర్యాపేట జిల్లా కమిటీ సమావేశాన్ని ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు ఎన్. సోమయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి అలుగుబెల్లి నర్సిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న సప్లమెంటరీ బిల్లులను మార్చి నెల చివరి నాటికి చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు, ప్రాథమిక విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు గాను మండల కేంద్రాలు, మేజర్ గ్రామ పంచాయతీల్లోని ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసి మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దాలని కోరారు. ప్రతి తరగతికి 20 మంది విద్యార్థులు, ప్రతి తరగతికి ఒక టీచర్ ఉండేలా, ప్రధానోపాధ్యాయులు అదనంగా ఉండేలా తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను నిర్వహించాలన్నారు. డిటెన్షన్ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయకూడదని సూచించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్. రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. అనిల్‌కుమార్, అరుణభారతి, జి. వెంకటయ్య, నాగేశ్వరరావు, బి. ఆడం, బి. రమేష్, డి. శ్రీనివాసాచారి, ఎన్. వెంకటేశ్వర్లు, ఆర్. శీనయ్య, అభినవ్, ఆర్. శ్రీను, పి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.230.84 కోట్లకు చేరుకున్న డిపాజిట్లు

- పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ తడక రమేశ్

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డిపాజిట్లు రూ.230.84 కోట్లకు చేరుకొందని బ్యాంక్ చైర్మన్ తడక రమేశ్ అన్నారు. ఆదివారం పోచంపల్లి పట్టణ కేంద్రంలోని చేనేత టై అండ్ డై భవనంలో బ్యాంక్ 50వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025–26 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. అలాగే బ్యాంకు ఆర్థిక పరిస్థితి, వాయిదా మీరిన బాకీలపై నివేదిక చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్యాంక్ ద్వారా ఇప్పటి వరకు రైతులు, వ్యాపారులు, ప్రజలకు రూ.164.08 కోట్ల మేర రుణాలు ఇచ్చామని పేర్కొన్నారు. ప్రస్తుతం 10 బ్రాంచ్‌ల ద్వారా బ్యాంక్ సేవలందిస్తున్నామని, త్వరలో రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, కల్వకుర్తిలో నూతన బ్రాంచ్‌లను ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా మరో 8 బ్రాంచ్‌లకు ఆర్‌బీఐ అనుమతులు ఇచ్చిందని తెలిపారు. ఖాతాదారులకు నాణ్యమైన సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సీఈఓ సీత శ్రీనివాస్, వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కర్నాటి వెంకటబాలసుబ్రహ్మణ్యం, ఏలే హరిశంకర్, సూరెపల్లి రమేశ్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, కొండమడుగు ఎల్లస్వామి, బిట్టు భాస్కర్, మక్తాల నర్సింహ, సీత హరినాథ్, సీత సత్యనారాయణ, రంగయ్య, కుడికాల బాల్‌నర్సింహ, సిద్దిరాములు, కొండ శంకరయ్య, భోగ విష్ణు, బండి యాదగిరి, సీనియర్ మేనేజర్ రాచకొండ మధుసూదన్, మేనేజర్ రచ్చ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

అడ్డగూడూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. అడ్డగూడూరు ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండల పరిధిలోని చిర్రగూడూరు గ్రామ పంచాయతీకి చెందిన బెల్లం సోమయ్య(60) ఈ నెల 20 తేదీ సాయంత్రం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి సైకిల్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా.. కోటమర్తి గ్రామానికి చెందిన మరిపడిగ సైదులు ద్విచక్ర వాహనంపై తిరుమలగిరి నుంచి వస్తూ చిర్రగూడూరు గ్రామ శివారులో సోమయ్య సైకిల్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సోమయ్య తీవ్రంగా గాయపడ్డాడు. సోమయ్యను కుటుంబ సభ్యులు సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడి కుమారుడు బెల్లం రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

బైక్ అదుపు తప్పి..

మద్దిరాల: బైక్ అదుపు తప్పి కిందపడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మద్దిరాల మండలం కుంటపల్లి శివారులోని సూర్యాపేట-దంతాలపల్లి రహదారిపై ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నూజివీడు జిల్లా దేవునిఆగిరిపల్లి గ్రామానికి చెందిన చలంచర్ల యాకూబ్(23) బతుకుదెరువు నిమిత్తం మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం రామజపురం గ్రామానికి చెందిన అక్కిరెడ్డి లింగమ్మ మామిడి తోటలో కూలీ పనులు చేసేందుకు నాలుగు నెలల క్రితం బంధువులతో వచ్చి వలస వచ్చాడు. చుట్టుపక్కల గ్రామాల్లోని మామిడి తోటలలో కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం మద్దిరాల మండలం కుంటపల్లి గ్రామంలో కూలీ మాట్లాడుకొని వస్తానని బైక్‌పై వెళ్తుండగా కుంటపల్లి శివారులో సూర్యాపేట-దంతాలపల్లి రహదారిపై మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన రాళ్లను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి మామ రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మల్లయ్య తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి: చేయని తప్పుకు నింద మోపారని మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భువనగిరి మండలం తుక్కాపురం గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కాపురం గ్రామానికి చెందిన ఎలకొండ సంజీవరెడ్డి కుమారుడు నవీన్‌రెడ్డి(45) సంజీవరెడ్డి సోదరుడి బావి వద్ద పైపులైన్ పగులగొట్టాడని శనివారం గ్రామంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. తాను పైపులైన్ పగులగొట్టలేదని నవీన్‌రెడ్డి చెప్పినా పట్టించుకోలేదు. దీంతో మనస్తాపానికి గురైన నవీన్‌రెడ్డి ఆదివారం తెల్లవారుజామున తన బావి వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాను ఏ తప్పు చేయలేదని, తన బంధువులు తప్పుడు ఆరోపణ చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని తన ఫోన్‌తో మెసేజ్ పెట్టాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

లాడ్జీలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నల్లగొండ: నల్లగొండ పట్టణంలోని ఓ లాడ్జీలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు నల్లగొండ టూటౌన్ పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉండవచ్చని, లాడ్జీలోని రిజిస్టర్‌లో కె. నవీన్, వృత్తి ఫైర్ వర్క్స్, విజయవాడ అని రాసి ఉందని పోలీసులు పేర్కొన్నారు. మృతుడి గురించిన వివరాలు తెలిసిన వారు 87126 70176 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

యాదగిరిగుట్ట ఆలయంలో భక్తుల రద్దీ



క్యూలైన్‌లో కిటకిటలాడుతున్న భక్తులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. సెలవు రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. దీంతో ధర్మదర్శనానికి సుమారు రెండు గంటల సమయం, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. స్వామివారికి నిత్యాదాయం రూ.49,28,666 సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



సైదులు (ఫైల్)

మద్దిరాల: విద్యుదాఘాతానికి గురైన రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల మండలం చిన్ననెమిలా గ్రామానికి చెందిన యాట సైదులు(51) తన వ్యవసాయ పొలం వద్ద శనివారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతడిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ కల్వల శ్రీనివాస్ తెలిపారు. మృతుడి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

మల్చింగ్ పద్ధతిలో సాగు.. లాభాలు బాగు

పాడిపంట

నడిగూడెం: ప్రస్తుత వేసవిలో నీటి ఎద్దడి కారణంగా పంటల సాగుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు అంటున్నారు. బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఈ పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా ఉపయోగించి పంటలను సాగు చేసేందుకు మల్చింగ్ పద్ధతి తోడ్పడుతుంది. వర్షాభావ పరిస్థితుల్లో భూగర్భజలాలు అడుగంటిపోవడం వల్ల ఉద్యానవన పంటలకు సరిపడేంత నీటిని అందించడం రైతులకు తలకు మించిన భారంగా మారింది. దీని నుంచి బయట పడేందుకు రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులను పాటించినట్లయితే అందుబాటులో ఉన్న నీటి వనరులను ఉపయోగించుకొని పంటలను సమర్థవంతంగా సాగు చేసుకోవచ్చని సీనియర్ హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్‌కుమార్ చెబుతున్నారు.

మల్చింగ్ అంటే ఏమిటి..

సారవంతమైన మట్టిని పట్టి ఉంచడంతో పాటు నేలలోని తేమను ఎక్కువ కాలం ఉంచేలా మొక్క చుట్టూ పలు రకాలైన పదార్థాలను పరచి ఉంచడాన్నే మల్చింగ్ అంటారు. దీని వలన తేమ ఆవిరై పోకుండా మొక్క చుట్టూ ఎక్కువ కాలం ఉంటుంది. మల్చింగ్‌కు ప్లాస్టిక్ పట్టాలతో పాటు కాగితపు ముక్కలు, సేంద్రియ పదార్థాలు, వరి గడ్డి, వ్యవసాయ వ్యర్థాలు తదితర వాటిని ఉపయోగిస్తారు.



మల్చింగ్ పద్ధతిలో సాగుచేసిన టమాట

మల్చింగ్ విధానంతో లాభాలు

పంట కాలంలో మల్చింగ్ చేయడం వలన నేలలోని తేమ ఆవిరి కాకుండా ఎక్కువ రోజులు మొక్క మొదలు భాగంలో ఉంటుంది. తేమను పరిరక్షించడమే కాకుండా ఉష్ణోగ్రత వ్యత్యాసాల వలన నేల భౌతిక స్థితి దెబ్బతినకుండా ఉంటుంది. నేలలోని సారవంతాన్ని కాపాడటంలో ఈ మల్చింగ్ ప్రధాన పాత్ర వహిస్తుంది. పంటలు సాగు చేయని కాలంలో సారవంతమైన మట్టిని కప్పి ఉంచుతుంది. మొక్కల మధ్య మల్చింగ్ పదార్థాలు ఉండడం వలన కలుపును బాగా నియంత్రిస్తుంది. దీని వలన పోషకాలన్నీ మొక్కలు తీసుకొనేందుకు వీలుంటుంది. నత్రజని స్థిరీకరణ జరుగుతుంది. నేలలో పోషకాల స్థాయి కూడా సహజ సిద్ధంగా పెరుగుతుంది. ఈ మల్చింగ్ విధానాన్ని దీర్ఘకాలంగా చేస్తే పంటల్లో గణనీయమైన పెరుగుదలతో పాటు చీడపీడలను సమర్థవంతంగా తట్టుకొనే శక్తి పెరుగుతుంది. అంతేకాకుండా పంటల ఉత్పాదనలో కూడా మెరుగుదల కన్పిస్తుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మల్చింగ్ చేసేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. భౌగోళిక పరిస్థితులను, నేల స్వభావాన్ని బట్టి మల్చింగ్ చేసుకోవాలి. మల్చింగ్‌తో పాటు సూక్ష్మనీటి పద్ధతులను అవలంబిస్తే నీటి వనరులు వృథాకాకుండా సమర్థవంతంగా ఉపయోగించుకోవచ్చు. సాగు చేసే పంటలను బట్టి మల్చింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఎక్కువ విస్తీర్ణంలో మల్చింగ్‌ను చేయదలిస్తే అందుబాటులో ఉండే వనరులను మల్చింగ్ పదార్థాలుగా ఉపయోగించడం మేలు.